# భయం భయం...

చిట్టా దామోదర శాస్త్రి

'అయ్యోయ్! బస్తీ నుంచి మందులట్టు కొస్తేనే డాట్టరుగారు వైద్దెం సేస్తాడంట.''

విన్నాడు రామయ్య

రామయ్య పల్లెటూరి మనిషి. ఎందుకో ఈ మధ్య బస్తీకి వెళ్లడం మానుకొన్నాడు. బస్తీ అతనికి కొత్త కాదు. మరెందుకు మానుకొన్నట్లు? అక్కడ తనకేం అప్పులు లేవు. విరోధులంత కన్నా లేరు. ప్రతి రోజు ఉదయం పత్రిక విప్పితే చాలు — రేపులు, మర్డర్లు, దోపిడీలు, దహన కాండలు!

వయస్సులో వున్నప్పుడైతే రామయ్య బాణాకర్ర గిరగిరా తిప్పుతూ జమా జెట్టీల్లాంటి పది మంది రౌడీలైనా నిలేసేవాడే. ఇప్పటికైనా ఇద్దరు ముగ్గుర్ని లెక్క చేయవలసిన పని లేదు. ఐనా, ఒంటరిగా బస్తీ కెళ్లాలంటే ప్రాణాల్ని గుప్పిట్లో పెట్టుకొన్నట్లే.

రామయ్య బస్తీ రోడ్డెక్కాడు. ఆలోచన్లో పడ్డాడు. ఊళ్ళో వున్న ఆయుర్వేద వైద్యుడు పనికిరాడంటాడు కొడుకు. మనవణ్ణి సమితి డాక్టరుకు చూపించాడు. ఆయన 'మందుల్లేవు బస్తీ కెళ్లి పట్టుకుర' మ్మంటాడు. కొడుక్కి పొలం పనులే సరిపోతున్నాయ్. ఏం చేస్తాడు? తానే బైలుదేరాడు.

దారంట ఎదురుగా నలుగురు వస్తున్నారు. పైగా చేతిలో కర్రలు, ఇద్దరిద్దరుగా నడవచ్చుగా! ఉహు ! ఏం మాట్లాడుకొంటున్నారో ఏమో? కట్ట కట్టుకొని కదిలి వస్తున్నారు. ఎంత తప్పుకొని నడిచినా వాళ్ల కర్ర తగలకుండా సాగలేమనిపించింది. పోనీ వాళ్ళు వెళ్లిన తరువాత వెళ్దామా అంటే, ఎందు కాగా నంటారేమో? వెనుతిరిగిపోతే వెంట పడతారేమో?

ఇదే పెద్దపులి వస్తే చెట్టెక్కవచ్చు. పాము వెంట పడితే వంకర టింకరగా పరుగెత్తవచ్చు. కాని తెల్లగుడ్డ లేసుకొని కసాయి పనికి సిద్ధపడే మనుషుల్ని పసికట్టే దెట్లా? పోలీసు కుక్కలు కూడా వీళ్లను పోల్చుకోలేక పోతున్నాయుట! అదుగో! వాళ్లొచ్చేస్తున్నారు. శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం... భజేహం పవిత్రం...

* * *

సుబ్బారావు స్కూటర్లో సినిమా కెళ్తున్నాడు. తానొక్కడే ఐతే నడిచే వెళ్లేవాడు. సుందరితో కలిసి సినిమాకి వెళ్లటానికే స్కూటరు కొన్నాడు. ఆదివారాలు కూడా ఆఫీసు పని తగలడ్డంతో ఆ రోజు రెండో ఆట సినిమాకు బైలుదేరారు.

అప్పటికీ సుందరి చెప్పనే చెప్పింది. ఊరి చివరి సినిమాకి వద్దండీ అని, కానీ తానే ధైర్యం చెప్పాడు. — 'నేనున్నాగా, భయం లేదు. అది సెకండ్ రిలీజ్ పిక్చరైనా అద్భుతంగా వుంటుంది. ఆ సినిమాకే పోదాం' అంటూ.

చివరి ఐదు నిమిషాలు సినిమా చూడకుండానే బండీ తీసుకొని బైటపడ్డాడు సుబ్బారావు. జనం కంటె ముందుగానే రోడ్డెక్కాడు. బైలుదేరిన వేళ మబ్బు తున కైనా లేదు. బలహీనుడైన రాజును పది మంది దుష్టులూ చుట్టు ముట్టినట్లు చిన్న చిన్న మబ్బులే చంద్రుణ్ణి కమ్మేశాయి. 'రాజుకే దిక్కులేక పోతే మేం మాత్రం ఏం చేయగలం?' అంటూ నక్షత్రాలు మొగం చాటేశాయి.

ఉన్నట్టుండి కరెంటు పోయింది. చీకటి రాజ్యమేలు తున్నట్లుంది. స్కూటరు జోరుగా పోతోంది. కాని ఏ ఒక్క మనిషి ఎదురైనా గుండె గుబగుబలాడుతోంది — వాడి చేతిలో కత్తే వుందో, పిస్తోలే వుందోనని. అల్లంత దూరంలో మలుపు. అది తిరిగితే మన కాలనీ, వచ్చేశాం భయం లేదు అంటున్నాడు సుబ్బారావు. స్పీడు తగ్గించి మలుపుతిరిగాడు. పశువులు రోడ్డు కడ్డంగా పడు కున్నాయి.

సుబ్బారావుకి సందేహమైంది. అవి వాటంతటవే పడుకున్నాయా? ఎవడైనా వాటిని నులేసి పక్కవాటుగా బడితే పుచ్చుకొని దాక్కున్నాడా? అనిసుందరికి చీకట్లు కదలి వస్తున్నట్లు కనిపించాయి. సుబ్బారావుకి కళ్లజోడు పని చేయలేదు, బండి నడిచేప్పుడున్న లైటు బండితోనే ఆగిపోయింది.


ఎవడో ఎదురుగా వచ్చాడు. 'టయం ఎంతైందండీ!' అన్నాడు.

'ఎవడువాడు? టైం ఎంతైతేనేం? తనది రేడియం డయలు వాచే. తలవంచి గడియారం చూసే లోపు తలేమౌతుందో?' అని సుబ్బారావనుకొంటూంటే సుందరి గొల్లుమంది.

* * *

పెళ్లి ముహూర్తాలు రాత్రిళ్ళెందుకు పెడతారో రాఘవయ్యకు అంతుపట్టలేదు. లగ్నం వేళకైనా వెళ్లకపోతే పీక పిసికిన పెడతారేకాని, ఆ వేళప్పుడు ఆటోలోనో, టాక్సీలోనో కళ్యాణ మంటపం చేరుకోవటం ఎంత ప్రమాదమో ఆ ముహూర్తం పెట్టే పంతులుగారు ఆలోచించరు. ఆయన కెంత సేపు ఆకాశంలోని గురుడో శుక్రుడో కనిపిస్తారే గాని నేల మీదున్న సామాన్యులు ఆ అర్ధరాత్రి ముహూర్తానికి కెళ్లలేక పడే బాధలు తెలియవు. రాఘవయ్య స్నేహితుడు సుందర మూర్తి. ఆ రాత్రే సుందరమూర్తి కూతురి పెళ్లి. పెళ్ళి కొడుకు తండ్రి గురునాథంతో సంబంధం గురించి మాట్లాడేందుకు తోడు రమ్మన్నాడు సుందరమూర్తి. ఆ గురునాథమెవరో గుర్తుకురాలా రాఘవయ్యకు. ఐనా సరేనని బైలు దేరారు. తీరా వాళ్లింటికి వెళ్లేప్పటికి వాడే 'ఏరా!' అని పలకరించాడు రాఘవయ్యను.

అప్పుడు గుర్తొచ్చింది! గురునాథం తానూ చిన్న ప్పుడు కలిసి చదువుకొన్నారు. మట్టలాగూ, ముక్కు పోగూ వాడు బలేగా వుండేవాడు గురునాథం. ఈ





నాటికి వాడో ఇంటివాడై పిల్లలు కలిగి సుఖంగా వుంటున్నాడు.

సుందరమూర్తి కొండెక్కినంత సంతోషించాడు. కూతురిపెళ్లి దగ్గరుండి జరిపించమన్నాడు. రాఘవయ్యని. కానీ పై ఆఫీసరు ఆ రోజే ఇన్‌స్పెక్షన్‌కి తగలడ్డాడు. అక్కడికీ రాఘవయ్య పెళ్లికెళ్ళాలి అని గొణిగాడు. చీకటి పడుతుండగా! అదే పొరపాటైంది. నీ కూతురి పెళ్లా? నీ కొడుకు పెళ్లా? అని రాత్రి పదైనా వదిలి పెట్టాడు కాదు.

మంచి ముహూర్తమేమో నెల్లూరులో కల్యాణ మంట పం దొరకలేదు. కోవూరు సత్రం కుదిరింది. ఓ టాక్సీ మాట్లాడి సకుటుంబంగా బైలుదేరాడు రాఘవయ్య. పినాకిని బ్రిడ్జి మీద కారు శరవేగంతో పోతూంది. 'పది నిమిషాలలో పెళ్లి పందిట్లో ఉంటాం' అనుకొంటూ వుండగా 'క్రీక్' అంటూ కారాగి పోయింది. కొంచెమైతే వెనక సీట్లో వాళ్లు ముందుసీట్లో పడేవాళ్లే.

కారణం తెలియక డ్రైవర్నడిగాడు రాఘవయ్య. వాడికి నోరు పెగల్లేదు. పరిశీలించి చూడగా కారు ముందు అడ్డంగా రాళ్లున్నాయి. ఇంతకంటే పెద్ద అపాయం పొంచి వుందనిపించింది. రాఘవయ్యకి కారును వెనక్కి వేగంగా పోనిమ్మన్నాడు. డ్రైవరు రివర్సు చేశాడు గాని కారు మాత్రం కదల్లేదు. అంటే అంతలోనే వెనక చక్రాలక్కూడా రాళ్ళుపెట్టారన్న మాట! రంగనాయకా! తండ్రీ! పాహిమాం! పాహిమం!

* * *

వెంకట్రావు చాలా కాలంగా తిరుపతి మొక్కు తీర్చుకోవాలనుకుంటున్నాడు. కాని బిజినెస్ పీక్ సీజన్లో పడటంతో కదల్లేక పోయాడు. మొదట సొంత కార్లో పోదామనుకున్నాడు. కాని నిత్యం వార్తల్లో వచ్చే దారి దోపిళ్లు హత్యలు వింటూంటే ఒళ్లు జలదరిస్తోందంటూ కారు ప్రయాణం కాదనుకొన్నాడు.

రైల్లో ప్రయాణం అంటే రెండ్రోజులు రానూ పోనూ రైల్లోనే గడపాలి అని సంకోచించాడు. డబ్బుకు లెక్క చేయవలసిన పని లేదు కాబట్టి విమానంలో బైలుదేరాడు. భార్య సుభద్ర చాలా సంతోషించింది. పిల్లలు సురేష్, శిరీషల ఆనందం సరేసరి.

'అదుగో వెంకటాద్రి! అదది గోగర్భం డాము! ఇటువైపు నుంచే రోప్‌వే వేస్తారట! మనం రేణిగుంట దాకా వెళ్ళి మళ్లీ వెనక్కి రావాలి. ఇక్కడ కొండ వుంటే ఎక్కడో ఎయిర్ పోర్టు కట్టారెందుకో?'' అంటున్నాడు వెంకట్రావు.

ఇంతలో 'ఢబ్బు'మని చప్పుడు! విమానం కొండనే ఢీకొందా అన్నట్లు కుదుపు. 'కదిలారంటే మీ ప్రాణాలు మీకు దక్కవ్' అని ఓ మొరటు కంఠం! సురేష్ వాళ్ల నాన్నని కావలించుకొన్నాడు. శిరీష ఎప్పుడో వాళ్లమ్మ డొక్కలో దూరిపోయింది. ఆ దంపతులకు నోట మాట రాలేదు. 'ఆపద మొక్కులవాడా! స్వామీ! ఎక్కడున్నావయ్యా!''